క్లుప్తంగా

భీమిలిలో చిరు జల్లులు



ఆనందపురం మార్కెట్ రహదారిలో చిత్తడిగా ఉన్న ప్రదేశం

తగరపువలస: భీమిలి డివిజన్‌లో మంగళవారం కురిసిన వర్షానికి పలు ప్రాంతాలు చిత్తడిగా మారాయి. రోహిణి కార్తె కారణంగా పగలంతా వాతావరణం వేడిగా ఉన్నప్పటికీ, మధ్యాహ్నం చల్లబడి జల్లులతో కూడిన చినుకులు వర్షించాయి. కొన్ని ప్రదేశాలలో సాయంత్రం వర్షం పడింది. దీంతో గ్రామదేవతల ఉత్సవాలు జరిగే గ్రామాలలోని ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఆరుబయట టెంట్లు కింద సేదతీరుతున్న బంధువులు, స్నేహితులు తలదాచుకోవడానికి అవస్థలు పడ్డారు. యథావిధిగా పల్లపు ప్రాంతాలలో నిలిచిన వర్షం నీరు కారణంగా అక్కడివారు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వ్యాపారాలు మందగించాయి.

నూకాలమ్మకు ప్రత్యేక పూజలు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో నూకాలమ్మ వారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముప్వ వారి కుటుంబ సభ్యులు ఈ పూజలు చేశారు. మహిళలు కలశాలతో నీరు తీసుకు వెళ్లి అమ్మవారికి అభిషేకాలు చేశారు. పసుపు, కుంకుమలు చెల్లించి, పూజలు నిర్వహించారు

ఘనంగా దేవర సంబరం

పద్మనాభం గ్రామంలో సోమవారం రాత్రి దేవర సంబరం ఘనంగా నిర్వహించారు. వచ్చే నెల రెండు నుంచి నాల్గవ తేదీ వరకు జరగనున్న బంగారమ్మ ఉత్సవాల్లో భాగంగా ఈ సంబరం నిర్వహించారు. దేవరతో అమ్మవారిని గ్రామంలోకి తీసుకు వచ్చారు. గ్రామస్తులు, కత్తి సాము గరిడీల వంటి సాంస్కృతి కార్యక్రమాల నడుమ సచివాలయం వద్ద ఉన్న పుట్ట వద్దకు వెళ్లారు. అక్కడ పూజ చేసిన అనంతరం పుట్ట మట్టిని గ్రామంలోని అమ్మవారి ఆలయంలోకి తీసుకువెళ్లారు.

ఎల్వీ పాలెంలో జోరుగా అక్రమ నిర్మాణాలు

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీలోని కొండవాలు ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. పంచాయతీలో జగనన్న కాలనీ, జట్లమ్మ కొండ ప్రాంతంలో ఈ ఏడాది కాలంలో సుమారు 60 వరకు అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్టు పలువురు ఆరోపిస్తున్నారు. స్థానికేతరుల నుంచి కొందరు కూటమి నాయకులు రూ.1 లక్ష నుంచి రూ.1.50 లక్షలు వసూలు చేసి ఖాళీ స్థలాలు చూపించి అండగా ఉంటామని చెప్పి దగ్గరుండి నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిసింది. ఈ ప్రాంతాలలో ప్రస్తుతం ఎలాంటి వసతులు లేకపోయినా గెడ్డలు, వాలు ప్రాంతాలలో ఎక్కువగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ విషయాన్ని వీఆర్వో అప్పారావు దృష్టికి తీసుకురాగా, పరిశీలించి తహసీల్దార్ ముందుకు తీసుకు వెళతానన్నారు.

యోగా వేడుకల ప్రాంగణం పరిశీలన



యోగా వేడుకలు జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎం.టి.కృష్ణబాబు

ఏయూక్యాంపస్: అంతర్జాతీయ యోగా వేడుకలు జరగనున్న బీచ్ రోడ్డు ప్రాంతాన్ని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు మంగళవారం సందర్శించారు. ప్రధాన కార్యక్రమం జరిగే ఆర్కే బీచ్ ప్రాంగణం, ఇతర కంపార్ట్‌మెంట్లు నిర్మించే ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమ ప్రణాళిక, నిర్వహణ విధానాన్ని కలెక్టర్ హరేందిర ప్రసాద్ వివరించారు. జేసీ మయూర్ అశోక్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన తనిఖీల్లో రైల్వే పోలీసులు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలివి.. ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ పీఆర్ బిషోయి, జీఆర్‌పీ ఎస్‌ఐ అబ్దుల్ మారూఫ్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా తమిళనాడుకు చెందిన పుగాజ్హేంది గంజాయిని అక్రమంగా రవాణా చేయడం గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని, రూ.35 వేల విలువైన 7 కేజీల గంజాయిని సీజ్ చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తంకోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

ఆటుపోట్ల నడుమ నాటుపడవల తయారీ



నాటు పడవల తయారీదారుల జీవితం **ఆటుపోట్ల నడుమ ఊగిసలాడుతూ సాగుతోంది.** ఒకప్పుడు ఎంతో డిమాండ్ కలిగి, **క్షణం తీరిక** లేకుండా మంచి ఆదాయం గడించిన **తయారీదారులంతా** ఇప్పుడు ఆశించిన **మేరకు పని** లేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొం**టున్నారు.** ఫైబర్ బోట్లు, తెప్పల రాకతో వీటికి **డిమాండ్** తగ్గింది. దీంతో భీమిలి తోటవీధిలో **కుట్టుపడవలను** తయారు చేసే మత్స్యకారు**ల** పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది.

- గతంలో ఏడాదికి 50 నుంచి 60 పడవల తయారీ
- ప్రస్తుతం సగం కూడా తయారవని వైనం
- తయారీదారుల అవస్థలు



తయారవుతున్న నాటు పడవలు



చెక్కలను కోస్తున్న మత్స్యకారులు

భీమునిపట్నం: నాటుపడవలకు సరైన డిమాండ్ లేక తయారీదారులు ఇబ్బంది పడుతున్నారు. భీమిలి తీర ప్రాంతంలోని భీమిలి, పెదనాగమయ్యపాలెం, అన్నవరం, చేపలుప్పాడ, మంగమారిపేట, తిమ్మపురం ప్రాంతంలోని మత్స్యకారులు గతంలో ఎక్కువ నాటుపడవల ద్వారా చేపలవేటను చేసేవారు. ఈ నాటు పడవలను తయారు చేసే కుటుంబాలు 50కి పైనే ఉండేవి. మామిడి, చింత, మరికొన్ని చెట్లకు చెందిన చెక్కలతో పడవలను ప్రత్యేక పద్ధతిలో తయారు చేస్తారు. కోసిన చెక్కలను ఎంతో పటిష్టమైన నారతో కుడతారు. అందువల్ల వీటిని నాటుపడవలు అనేకాకుండా కుట్టుపడవలని కూడా అంటారు. ఒక పడవ దాని సైజుని బట్టి రూ. 35వేల నుంచి 50 వేల వరకు ఉంటుంది. జిల్లా మొత్తంమీద ఇక్కడ మాత్రమే ఈ తరహా పడవలు తయారువుతున్నాయి.

తగ్గిన ఆదరణ

ఇక్కడ తయారవుతున్న ఈ నాటుపడవలను భీమిలి పరిధిలోనే కాకుండా విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని తీరప్రాంత గ్రామాలైన గంగవరం, పూడిమడక, నక్కపల్లి, కంచేరు, కోనాడ, తిప్పలవలస, ముక్కాం, కళింగపట్నం, చింతపల్లి, భావనపాడు నుంచి పలువురు మత్స్యకారులు ఎక్కువగా కొనుగోలు చేసి తీసుకుని వెళ్లేవారు. దీంతో నెలకు 30 నుంచి 60 పడవల వరకు తయారు చేసేవారు. ఇవి ఎలాంటి పరిస్థితుల్లోను చెక్కు చెదరకుండా ఉండడంతో మంచి గిరాకీ ఉండేది. కాని ఫైబర్ పడవలు, తెప్పలవాడకం ప్రారంభమైన తరువాత క్రమంగా వీటికి డిమాండ్ తగ్గుతూ వచ్చింది. కొన్ని సంవత్సరాల నుంచి వీటికి పూర్తిగా **ఆదరణ కరువైపోయింది. ఒకప్పుడు నెలకు 60 పడవల వరకు తయారు చేసిన వీరు ఇప్పుడు సంవత్సరానికి 30 నుంచి 40 పడవలు కూడా తయారు చేయని పరిస్థితి. మరో వృత్తి తెలియకపోవడంతో వేరే పని చేయలేకపోతున్నారు. దీంతో ఆదాయం** లేక కుటుంబపోషణ భారంగా మారడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తమకు ఏదో ఒక మార్గం చూపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



భీమిలి సమీపంలోని తీరప్రాంత గ్రామానికి ఎడ్ల బండిపై తరలిస్తున్న నాటుపడవ (ఫైల్)

ఆదరణ తగ్గింది



గతంలో నాటు పడవలతోనే అందరూ చేపల వేట సాగించేవారు. ఈ పడవల వాడకం ఎక్కువగా ఉండడంతో అందరికీ ఎంతో బాగుండేది. కాని ఫైబర్ పడవలు, తెప్పలు వచ్చిన తరువాత ఆదరణ తగ్గిపోయింది. తక్కువ పడవలే తయారు చేస్తున్నాం.

– పొట్టి బుల్లిబాబు, మత్స్యకారుడు, భీమిలి

కుటుంబ పోషణ భారంగా ఉంది



మా పూర్వీకుల నుంచి ఇదే వృత్తిలో కొనసాగుతున్నాం. గతంలో మంచి ఆదాయం వచ్చేది. కుటుంబ నిర్వహణకు ఏ ఇబ్బంది ఉండేది కాదు. ఇప్పుడు పడవల తయారీ బాగా తగ్గిపోవడంతో అందరికీ ఆదాయం చాలా కొద్దిగా లభిస్తోంది. దీనివల్ల కనీస అవసరాలకు కూడా ఆదాయం సరిపోవడం లేదు. కుటుంబాన్ని పోషించుకోవడం ఎంతో భారంగా ఉంటోంది.

– పొట్టి వీర్రాజు, మత్స్యకారుడు, భీమిలి

ప్రభుత్వం ఆదుకోవాలి



ఆదాయం కోల్పోయి ఎన్నో అవస్థలు పడుతున్న మాకు ప్రభుత్వం వేరే ఆదాయ మార్గాన్ని చూపి ఆదుకోవాలి. మాకు రుణ సదుపాయం కల్పిస్తే సామగ్రి, పనిముట్లు తెచ్చుకోవడానికి అవకాశం ఉంటుంది. దీనివల్ల కొద్ది మేరకు బాగుంటుంది.

–నొల్లి చిన రమణ, మత్స్యకారుడు, భీమిలి

అహల్యాబాయ్ హోల్కర్‌కు ఘన నివాళి



అహల్యాబాయ్ హోల్కర్ ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పద్మనాభం: వీర వీనిత అహల్యా బాయ్ హోల్కర్ జయంతి వేడుకలను పద్మనాభం గోస్తని విద్యాపీఠంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె ఫ్లెక్సీకి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈవోఆర్డీ మీనాకుమారి మాట్లాడుతూ అహల్యాబాయ్ హోల్కర్ న్యాయశీలి అన్నారు. ప్రజల పట్ల వాత్సల్యం, దయాగుణం కలిగిన ఆమె రాజమాతగా పేరు గాంచారన్నారు. రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రూపాకుల రవికుమార్ మాట్లాడుతూ మొగలాయిల దాడుల్లో దెబ్బతిన్న సోమనాథ్, కాశీ విశ్వేశ్వరాలయాలను పునరుద్ధరించారని తెలిపారు. రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్, గాయత్రి వెల్ఫేర్ కల్చర్ యూత్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ నాయకుడు తాలాడ పద్మనాభం, టీడీపీ నాయకుడు కంటుబోతు ఎర్నాయుడు, బీజేపీ మండల అధ్యక్షురాలు తమటపు నాగమణి, సిరిపురపు వెంకటరావు, పాలూరి కృష్ణారావు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ 4జీ పనులకు స్థానికుల అభ్యంతరం

ఉద్యోగి సర్దిచెప్పడంతో శాంతించిన వైనం



బీఎస్ఎన్ఎల్ ఉద్యోగితో మాట్లాడుతున్న బంగ్లామెట్ట వాసులు

తగరపువలస: బంగ్లామెట్టపై బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ వద్ద మంగళవారం జరుగుతున్న 4జీ అభివృద్ధి పనులకు స్థానికులు అభ్యంతరం తెలిపారు. బంగ్లామెట్టపై పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌కు అనంతర కాలంలో రిలయన్స్, ఎయిర్‌టెల్, జియో తదితర నెట్‌వర్క్‌లకు సంబంధించిన ఏంటెనాలు పెట్టడం వలన రేడియేషన్ ప్రభావంతో వ్యాధుల బారిన పడుతున్నామని తెలిపారు. విద్యుత్ స్తంభాలను సైతం ప్రైవేట్ నెట్‌వర్క్‌ల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వాడేసుకుంటూ తమ రోజువారీ జీవితానికి ఆటంకం కలిగిస్తున్నట్టు చెప్పారు. సెల్‌టవర్‌ను తొలగించడమే తమ ఆరోగ్యానికి పరిష్కారమని బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి సత్యనారాయణ ముందు వాపోయారు. దీంతో ఆయన వారికి సర్దిచెప్పారు. బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ అభివృద్ధిలో భాగంగా ప్రస్తుతం 4జీకి సంబంధించిన పరికరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తమది ప్రైవేట్ నెట్‌వర్క్ కాదని, అభ్యంతరాలు ఉంటే ఉన్నత స్థాయి అధికారులకు చెప్పుకోవాలి తప్ప తాము చేస్తున్న పనులు అడ్డుకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవలసి ఉంటుందని వివరించారు. దీంతో స్థానికులు శాంతించారు. అనంతరం 4జీ అభివృద్ధి పనులు కొనసాగాయి.

విస్తృతంగా వాహనాల తనిఖీ



కొమ్మాది జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ భాస్కరరావు



వెంకటేశ్వరమెట్ట వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న భీమిలి పోలీసులు

మధురవాడ: వాహనచోదకులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పీఎం పాలెం ఎస్‌ఐ భాస్కరరావు హెచ్చరించారు. కొమ్మాది జంక్షన్, మధురవాడ పరిసర ప్రాంతాలలో పోలీసులు మంగళవారం సాయంత్రం విస్తృతంగా వాహనాలు తనిఖీ చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ వాహనదారులంతా ద్విచక్ర వాహనచోదకులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు నిర్ణీత సంఖ్యకు మించి ప్రయాణికులను ఎక్కించకూడదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణాలు చేయాలని తెలిపారు.

ఇద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

తగరపువలస: స్థానిక వెంకటేశ్వరమెట్ట వద్ద జాతీయరహదారిపై ఇతర జిల్లాల నుంచి వచ్చే వాహనాలను మంగళవారం సాయంత్రం భీమిలి పోలీసులు తనిఖీ చేశారు. అనుమానాస్పద వాహనాలు, వ్యక్తుల తనిఖీలలో భాగంగా చేపట్టిన ఈ డ్రైవ్‌లో రెండు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. వీరికి జరిమానా విధించారు. ఈ తనిఖీలలో ఎస్‌ఐలు గంటా హరీష్, చింతలపూడి చిరంజీవిరావు, సిబ్బంది పాల్గొన్నారు.



మజ్జివలస రాస పోలమాంబ



గుడివాడ తోగాలమ్మ



గుడివాడ ముత్యాలమ్మ

అమ్మ రూపం.. అపురూపం

అమ్మవార్లు మంగళవారం ప్రత్యేక అలంకరణల్లో దర్శనమిచ్చారు. భీమిలి మండలంలోని మజ్జివలస రాస పోలమాంబను గజ మాలలు, పూలదండలతో నేత్రపర్వంగా అలంకరించారు. టీవీస్ రోడ్డులోని గుడివాడ తోగాలమ్మను, ముత్యాలమ్మను నిమ్మకాయలు, జర్బరా పువ్వులు, తులసిమాలలు, బంతి పువ్వులతో అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. – తగరపువలస

పోలీసులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



ఏఆర్‌సీ ముగింపు వేడుకలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి అడిషనల్ కమాండెంట్ సత్యం, పాల్గొన్న బెటాలియన్ పోలీస్ అధికారులు సిబ్బంది

పీఎం పాలెం: బాధ్యతాయుతమైన పోలీసు వ్యవస్థలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది విధినిర్వహణలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని 16వ పోలీస్ బెటాలియన్ ఇన్‌చార్జి అడిషనల్ కమాండెంట్ పి.సత్యం అన్నారు. బక్కన్నపాలెం ఏపీఎస్‌పీ పోలీస్ బెటాలియన్‌లో మంగళవారం 5వ బ్యాచ్ యాన్యువల్ రిఫ్రెషర్ కోర్స్ ముగింపు వేడుకలో ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి ప్రజల నుంచి, అలాగే ఉన్నతాధికారుల నుంచి మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. అందరూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా వెపన్స్ వినియోగించడంలో శిక్షణ, ఇండోర్ క్లాసెస్ నిర్వహించారు. ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలకు నీళ్లు.. ఇష్టానుసారం ఇళ్లు



శివశక్తినగర్ రోడ్డులో నిబంధనలు పట్టకుండా చేపడుతున్న నిర్మాణాలు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు శివశక్తినగర్ 80 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డులో కనీస నిబంధనలు కూడా పట్టించుకోకుండా భవన నిర్మాణాలు చేస్తున్నా, జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబరు. 27లో 70వ వార్డు సచివాలయం పరిధిలో ఈ భవనాలు నిర్మిస్తున్నారని, వీటికి ప్లాన్ గాని, సెట్ బ్యాక్స్ వంటివి లేవని చెబుతున్నారు.. పక్కనే గ్యాస్ గొడౌన్ ఉందని, వరుసగా 3 ఇళ్లు నిర్మాణం చేస్తున్నారని, ఒకదానికి ఇంకొక దానికి మధ్య కొంచెం గ్యాప్ కూడా లేదంటున్నారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగోతి జ్యోతిష్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు ఇచ్చినట్టు చెప్పారు. పేక మేడల్లా నివాసాలు కట్టేయడం వలన ఇబ్బందులు వస్తాయని, అధికారులు నిజానిజాలు నిగ్గుతేల్చాలని, లేకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు ఇస్తానని తెలిపారు.

అమ్మవార్ల సన్నిధిలో చిన్న శ్రీను



పెదనాగమయ్యపాలెంలో దుర్గాలమ్మ వారిని దర్శించుకుంటున్న మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం మత్స్యకార గ్రామదేవతలు పోలమాంబ, భూలోకమ్మ, రమణమ్మ, దుర్గాలమ్మ అమ్మవార్ల పండగ మహోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు మంగళవారం అమ్మవారిని దర్శించుకున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ జల్లి సుభద్ర కూడా అమ్మవార్ల దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ నాలుగో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలు, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, స్థానిక సర్పంచ్ బొడ్డు సత్తెమ్మ, పంచాయతీ అధ్యక్షుడు బొడ్డు దుర్గారావు, ఎంపీటీసీ సభ్యురాలు తోట అరుణ, ఎల్లారావు తదితరులు పాల్గొన్నారు.

8న గీతం డిగ్రీ, పీజీ కోర్సుల ప్రవేశ పరీక్ష

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి జూన్ 8వ తేదీన గీతం అడ్మిషన్ టెస్ట్ (గ్యాట్) నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్ల డైరెక్టర్ ఎం.జగదీష్ తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా బయో కెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్ విత్ కాగ్నిటివ్ సిస్టమ్స్, మైక్రోబయాలజీ, మ్యాథ్స్, ఫిజిక్స్, స్టాటస్టిక్స్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో 4 సంవత్సరాల బీఎస్సీ (ఆనర్స్) కోర్సులు, మూడు సంవత్సరాల బీసీఏ కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే అప్లైడ్ మ్యాథ్స్, బయో కెమిస్ట్రీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, డేటా సైన్స్, బయో కెమిస్ట్రీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రో బయాలజీ, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో 2 సంవత్సరాల ఎమ్మెస్సీ కోర్సులు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఎంసీఏ కోర్సు కూడా నిర్వహిస్తున్నామన్నారు.

భాస్కర్‌నగర్‌లో మట్టి రోడ్లతో అవస్థలు



కాలనీలో రోడ్డు ఇలా..

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెం భాస్కర్‌నగర్‌లో మట్టి రోడ్లతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక వైపు జాతీయ రహదారికి, రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్లకు అత్యంత చేరువలో ఉన్నా, కాలని కనీస అభివృద్ధికి నోచుకోలేదు. ఇక్కడ పలు అపార్ట్‌మెంట్లు, సుమారు 50 వ్యక్తిగత నివాసాలు ఉన్నాయి. 1000పైనే జనాభా ఉన్న ఈ కాలనీలో ఎక్కడా సీసీ రోడ్లు లేవు. ప్రధాన రోడ్డు కూడా మట్టి రోడ్డే కావడంతో ఎండకు దూళి, వర్షం పడితే బురదలో రాకపోకలు సాగించలేక స్థానికులు అవస్థలు పడుతున్నారు. దీనిపై అధికారులు, పాలకులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకునే వారే కరువయ్యారని కాలనీ వాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సచివాలయంలో మూలకు చేరిన కంప్యూటర్లు



సచివాలయంలో కంప్యూటర్ పరిస్థితి

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు వరాహగిరి నగర్ సచివాలయంలో కంప్యూటర్లు మూలకు చేరాయి. ఆరు నెలలుగా ఇక్కడ కంప్యూటర్లు, ప్రింటర్లు పని చేయకపోవడంతో అధికారులు తమ సెల్‌ఫోన్ల ద్వారా ఇక్కడ కార్యక్రమాలను నిర్వహిస్తున్న పరిస్థితి. ఒక గంటలో పూర్తి కావాల్సిన పని సుమారు రెండు రోజులు పడుతోందని ఇక్కడికి వచ్చిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సచివాలయంలో కంప్యూటర్లు పని చేయడం లేదని, దీంతో ప్రజలకు సేవ అందించలేకపోతున్నామని ఇక్కడి సిబ్బంది వాపోతున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. అధికారుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తూ వెనుతిరుగుతున్నారు.

భలే మంచి రో'జూ'



ఆకలి వేస్తుంది ఆహారం పెట్టు : నోరు తెరిచిన నీటి ఏనుగు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూపార్క్ కళకళలాడింది. ఒకవైపు చిన్నారులు విత్తన బంతులు వేస్తూ సందడి చేస్తుంటే, సందర్శకులతో జూ అంతా కోలాహలంగా మారింది. జూలో జంతువుల చేష్టలు చూపరులను కట్టిపడేశాయి. ఏనుగులు తొండంతో గోడ దగ్గరకు రావడంతో పిల్లలు కేరింతలు కొట్టారు. వాతావరణం చల్లగా ఉండడంతో జంతువులు మరింత ఉత్సాహంగా కనిపించాయి. ఖడ్గమృగం నీటిలో మునిగి తేలుతూ ఉంటే, ఒడ్డున నిలబడిన రంగుల పెయింటెడ్ స్టార్క్స్ పక్షులు చేపల కోసం గంటల తరబడి ఎదురు చూడటం ఆసక్తికరంగా అనిపించింది. మరోవైపు ఆహారం తీసుకొచ్చిన జూ సిబ్బందిని చూడగానే నీటి ఏనుగు నోరు తెరిచి ఆకలిగా ఉందని సైగలు చేస్తూ అందరినీ నవ్వించింది. ఇక మొసళ్ల కొలనులోనైతే అసలు సిసలు పోటీ ఏర్పడింది. సిబ్బంది వేసిన చేపల కోసం ఘరియల్ మొసళ్లు, కొంగలు పోటీ పడి ఎవరికి దొరికితే వారిది అన్నట్లుగా ఎదురుచూశాయి. మొత్తానికి ఇందిరా గాంధీ జూపార్క్ సందర్శకులకు మంచి వినోదాన్ని పంచింది.



ఎవరికి దొరికితే వారికే చేప : పోటీ పడుతున్న ఘరియల్, కొంగ



ఖడ్గమృగం కొలనులో చేపల కోసం వెదుకుతున్న పెయింటెడ్ స్టార్క్ పక్షులు